aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTV NETWORK

www.mahaaprabha.com

నమస్తే
మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

గురువారం
15-10-2026 సంపుటి : 01 సంచిక : 204 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA. తెలంగాణ NAMASTEY MAHAAPRABHA TGTEL/26/A0738 mahaaprabha.com Email : info@mahaaprabha.com



సింగరేణి కార్మికులు తిరగబడితే దక్షిణాది రాష్ట్రాలు చీకట్లోనే!

- తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులది కీలక పాత్ర
- 42 రోజుల సమ్మెతో బొగ్గు ఉత్పత్తి నిలిపివేత
- కేసీఆర్‌కు అండగా నిలిచిన కార్మిక లోకం
- బొగ్గు ఉత్పత్తిలోనే కాదు.. ఉద్యమాల్లోనూ ముందంజ
- కార్మికుల త్యాగాలను మరిచిపోలేం
- సింగరేణి కార్మికుల పోరాట స్ఫూర్తికి వందనం
- గోదావరిఖని గడ్డ పోరాటాలకు ప్రతీక
- సింగరేణి కార్మిక గర్జన సభలో కేటీఆర్

గోదావరిఖని అక్టోబర్ 14 మహా ప్రభ

సింగరేణి కార్మికులు సమ్మెకు దిగితే దక్షిణాది రాష్ట్రాలే చిమ్మచీకట్లో ఉండిపోయే పరిస్థితి ఉండేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికులు పోషించిన పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. గోదావరిఖనిలోని సింగరేణి స్టేడియంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన మాట్లాడారు. పోరాటాల పురిటిగడ్డ రామగుండం అని, నల్లబంగారు గనుల్లో చెమటోడ్చి దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తున్న కార్మికులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. సింగరేణికి 137 ఏళ్ల చరిత్ర ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ సంస్థ అభివృద్ధి వెనుక వేలాది మంది కార్మికుల శ్రమ, త్యాగాలు ఉన్నాయని చెప్పారు. బొగ్గు గనుల్లో పనిచేస్తూ -మిగతా 3 లో



మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
- జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీపక్కే పిలుపు
- నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
- తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
- ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
- సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో

03

అక్టోబర్ 16న 'లెహ్రా దో తిరంగా' పేరుతో ఆందోళన

సీఈసీ రాజీనామా డిమాండ్‌తో మరోసారి ఆందోళనకు సీజేపీ సిద్ధమైంది. 'లెహ్రా దో తిరంగా' పేరుతో అక్టోబర్ 16న ఢిల్లీలో భారీ నిరసన చేపట్టనున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీపక్కే ప్రకటించారు. జాతీయ జెండా ఊపడం నేరమా? అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని, ఢిల్లీ పోలీసులను ప్రశ్నించారు. ఢిల్లీకి రాలేని మద్దతుదారులు తమ ప్రాంతాల్లోనూ తిరంగా మార్చ్ నిర్వహించాలని పిలుపునిచ్చారు.

యువతే పారిశ్రామిక శక్తి!

తెలంగాణను అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- యువ పారిశ్రామికవేత్తలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య కొత్త పరిశ్రమలకు ప్రోత్సాహం
- పెరి అర్బన్ ప్రాంతాన్ని తయారీ రంగ కేంద్రంగా అభివృద్ధి
- 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మారుస్తాం
- మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహం
- ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యం
- సమ్మిళిత గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2026లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 14 మహా ప్రభ

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు యువత, మహిళలకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే యువ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్‌లో సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమాఖ్య గ్లోబల్ బిజినెస్ సమ్మిట్--2026 ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. కొత్త తరాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు కృషి చేస్తున్న సమాఖ్య చాంబర్ -మిగతా 3 లో



03

రైల్వే ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త

- 78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
- బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
- ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ. 17,951 చెల్లింపు
- నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
- ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం

నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్ఆర్‌హెచ్



03





03

రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

- రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
- పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలుచూస్తే ఇబ్బందులు
- తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
- హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
- కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే!



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ ప్రధాని కావడం ఖాయం

- దసరాలోగా నామినేటెడ్ పోస్టుల భర్తీకి అవకాశం
- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో భారీ ర్యాలీ
- హైదరాబాద్‌లో 2 లక్షల మందితో బహిరంగ సభ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై 23న సీఎంతో భేటీ
- కేసీఆర్ కుటుంబం అక్రమాలను వెలుగులోకి తెస్తున్నాం
- మహిళా జర్నలిస్టులపై రాహుల్ వ్యాఖ్యల ప్రచారం అవాస్తవం
- గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిగా మాట్లాడిన టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, అక్టోబర్ 14 మహా ప్రభ

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దసరా పండుగలోగా నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా డిమాండ్‌తో దసరా తర్వాత హైదరాబాద్‌లో రెండు లక్షల మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడారు. -మిగతా 3 లో



03

బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు మరణశిక్ష

- మీరట్ జిల్లా కోర్టు సంచలన తీర్పు
- భర్త సౌరభ్‌ను హత్య చేసినట్లు నిర్ధారణ
- మృతదేహాన్ని ముక్కలుగా చేసి డ్రమ్‌లో దాచిన నిందితులు
- వివాహేతర సంబంధమే హత్యకు కారణమని అభియోగం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజరైన నిందితులు
- గత సెప్టెంబర్ 30న ముగిసిన విచారణ
- 22 మందికి పైగా సాక్షుల విచారణ
- 13 నెలల్లోనే కేసు విచారణ పూర్తి



కాశీ ఆలయంలో బంగారం మాయం!



మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి
- మహిళలు ఇతరులపై ఆధారపడకుండా ఎదగాలి
- సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలి
- బతుకమ్మ వేడుకల్లో మంత్రి సీతక్క సందేశం
- గాంధీభవన్‌లో ఘనంగా సంబరాలు
- ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ
- భావితరాలకు సంప్రదాయాలను అందించాలి
- మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

హైదరాబాద్, అక్టోబర్ 14 మహా ప్రభ

తెలంగాణ మహిళల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో పండుగ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మహిళలతో కలిసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం తెలంగాణ మహిళలకు గర్వకారణమని అన్నారు. మహిళలు ఇతరులపై -మిగతా 3 లో

అఖిలేష్ యాదవ్‌కు షాక్..

- బీజేపీలో చేరిన ఎస్పీ రెబల్ ఎమ్మెల్యేలు



సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు తిరుగుబాటు ఎమ్మెల్యేలు బుధవారం బీజేపీలో చేరారు. 2022లో ఈ ముగ్గురూ ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గౌరి గంజ్ నుంచి గెలిచిన రాకేష్ ప్రతాప్ సింగ్, గోసయ్‌గంజ్ నుంచి గెలిచిన అభయ్ సింగ్, కల్పి నుంచి గెలిచిన వినోద్ చతుర్వేది బీజేపీలో చేరారు. ఈ ముగ్గురు ఇప్పటికే ఎస్పీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారు.2024లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో వీరు ఎస్పీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా బీజేపీ అభ్యర్థికి ఓటు వేశారు. 2027లో ఉత్తర ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎస్పీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడం అఖిలేష్ యాదవ్‌కు భారీ ఎదురుదెబ్బగానే పరిగణించాలి. పార్టీ మారిన ముగ్గురూ ఎస్పీకి అత్యంత కీలకమైన నేతలే. మరికొందరు నేతలు కూడా ఎస్పీ నుంచి బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ బీజేపీ నుంచి కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఎస్పీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. కానీ, పరిస్థితి చూస్తుంటే మాత్రం ఎస్పీ నుంచి ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలానే కనిపిస్తోంది. మరోవైపు ఎస్పీ.. కాంగ్రెస్‌తో పొత్తు కోసం ప్రయత్నిస్తోంది. కానీ, సీట్ల పంచాయితీ మాత్రం తేలడం లేదు. అయితే, బీజేపీలో ఎమ్మెల్యేల చేరిక ప్రభావం ఎస్పీపై ఎంతవరకు ఉంటుందో చూడాలి. యూపీలో వరుసగా రెండుసార్లు యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలోని బీజేపీ అధికారం దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈసారి కూడా గెలిచి యూపీలో హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని బీజేపీ భావిస్తోంది.

కుంటి సాకులను ఆమోదించం..

- కేంద్ర ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం

-2023 నాటి శృంగేరి ఎన్నికల కౌంటింగ్ వీడియో గల్లంతు



న్యూఢిల్లీ, అక్టోబర్ 14 మహా ప్రభ

అందుబాటులో ఉన్న రికార్డులను సమర్పించడంలో విఫలమైతే ఈసీఐకి వ్యతిరేకంగా ప్రతికూల నిర్ణయం తీసుకోవలసి ఉంటుందని న్యాయస్థానం హెచ్చరించింది. తన రికార్డులను పోగొట్టుకున్నామని ఈసీఐ ఎలా చెప్పగలదు? ఎన్నికలు నిర్వహించడమే మీ ప్రధాన విధి. అటువంటప్పుడు మీ వద్ద కచ్చితంగా ఒక పత్రం ఉండాలి కదా. మేము దానిని వెతికే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడానికి ఆస్కారం ఎక్కడుంది? మీరు ఆ పత్రాన్ని ఎన్నికైన అభ్యర్థికి ఇచ్చారు.రికార్డుల భద్రత లేదా నిర్వహణ మీ వద్ద లేదా? మీ వద్ద ఉన్న దానిని తదుపరి విచారణ తేదీన సమర్పించండి. లేకపోతే మేము మీపై ప్రతికూల నిర్ణయానికి రావలసి ఉంటుంది. ఎలాంటి బలహీనమైన సాకులు మేము అంగీకరించము అని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవాలతో కూడిన ధర్మాసనం ఈసీఐకి స్పష్టం చేసింది. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి డీఎన్ జీవరాజ్‌పై 201 ఓట్ల స్వల్ప తేడాతో విజయం సాధించినప్పటికీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల పునఃలెక్కింపు అనంతరం తన పదవిని కోల్పోయిన కాంగ్రెస్ నేత టీడీ రాజేగౌడ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరుపుతున్నది. 2023లో జరిగిన అసలు లెక్కింపు, ఈ ఏడాది మేలో నిర్వహించిన రీకౌంటింగ్, రెండింటికీ సంబంధించిన ఎన్నికల పరిశీలకుడి నివేదిక వీడియో రికార్డింగులను రాజేగౌడ కోరిన తర్వాత, ఫుటేజ్‌ను గుర్తించడంలో విఫలమైనందుకు ఈసీఐని ధర్మాసనం తప్పుపట్టింది.

కేంద్ర పింఛను పథకాల్లో ఇందిర పేరు తొలగింపు



న్యూఢిల్లీ: అక్టోబర్ 14 మహా ప్రభ

వాటిలో కొన్నింటికి ఉన్న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరును తొలగించింది. ఎన్ఎస్ఏపీని 2026-27 నుంచి అయిదేండ్ల పాటు రూ.53,428 కోట్ల బడ్జెట్‌తో కొనసాగించాలని నిర్ణయించింది.తాజా నిర్ణయం ప్రకారం ఎన్ఎస్ఏపీని ప్రధాన్ మంత్రి సామాజిక్ సహాయత యోజనగా, ఇందిరా గాంధీ వృద్ధ్యాప్య పింఛను పథకాన్ని ప్రధాన్ మంత్రి వృద్ధావస్థ పెన్షన్ యోజనగా, ఇందిరా గాంధీ వితంతు పెన్షన్ స్కీమ్‌ను ప్రధాన్ మంత్రి విధవ పెన్షన్ యోజనగా, జాతీయ కుటుంబ ప్రయోజన పథకాన్ని ప్రధాన్ మంత్రి పరివార్ లాభ్ యోజనగా మార్చారు.

నెట్‌ఫ్లిక్స్‌లో 1,000 మంది ఉద్యోగుల తొలగింపు



న్యూఢిల్లీ:అక్టోబర్ 14 మహా ప్రభ

ఆశించిన స్థాయికంటే వృద్ధి నెమ్మదించడం, వీక్షకుల సమయం కోసం మార్కెట్‌లో విపరీతంగా పోటీ పెరిగిపోవడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. 2022 తర్వాత కంపెనీ చేపట్టిన అత్యధిక ఉద్యోగాల కోత ఇదే కావడం గమనార్హం.ఈ లే ఆఫ్‌లు కంపెనీ మొత్తం వర్క్‌ఫోర్స్‌లో సుమారు ఆరు శాతం మందిపై ప్రభావం చూపనున్నాయి. 'ది వాల్ స్ట్రీట్' జర్నల్ నివేదిక ప్రకారం ఈ తొలగింపుల ప్రభావం ప్రధానంగా ప్రొడక్ట్, టెక్నాలజీ, లీగల్, హ్యూమన్ రిసోర్సెస్(హెచ్‌ఆర్) విభాగాలపై ఎక్కువగా పడింది.

యూపీఐ చెల్లింపులను అంగీకరించం



న్యూఢిల్లీ, అక్టోబర్ 14 మహా ప్రభ

ఎండీఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇకపై యూపీఐ చెల్లింపులను అంగీకరించ రాదని నిర్ణయించినట్లు వారు తెలిపారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలుకు డిజిటల్ చెల్లింపులు చేసే వాహనదారులకు ఇది ఇబ్బందికరమే అయినప్పటికీ ఈ నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొన్నారు.చమురు కంపెనీల ఏకపక్ష నిర్ణయాలతో పెట్రోలియం డీలర్లు ఇప్పటికే తక్కువ మార్జిన్ లాభాలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఎండీఆర్ వద్దని అసోసియేషన్ పంజాబ్ అధ్యక్షుడు పరంజిత్ సింగ్, అధికార ప్రతినిధి మాంటీ సెహగాల్ తెలిపారు.

ఢిల్లీ నిరసనలపై హార్వర్డ్ స్కాలర్ల ఢీ



న్యూఢిల్లీ అక్టోబర్ 14 మహా ప్రభ

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పనితీరు, 'సర్' అవకతవలపై ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన స్కాలర్లు, విద్యార్థులు, ఆచార్యులు రెండు వర్గాలుగా విడిపోయారు! వీరిలో ఒక వర్గం నిరసనకారులను సమర్థించగా, మరొక వర్గం వారిని విమర్శించింది.ఈ నెల 10న ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన సీజేపీ మద్దతుదారులపై పోలీసుల చర్యను హార్వర్డ్ వర్సిటీకి చెందిన 100 మంది పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది మంగళవారం ఖండించారు. పోలీసులు క్రూరంగా వ్యవహరించారని ఆరోపించారు. మరోవైపు హార్వర్డ్‌కే చెందిన 44 మంది భారత స్కాలర్లు ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసనలను భారత రాజ్యాంగ వ్యవస్థలైన ఈసీ, సుప్రీం కోర్టు లాంటి వాటిపై జరిగిన దాడులుగా అభివర్ణించారు.

అరామ్‌కో హెడ్‌క్వార్టర్స్‌పై హౌతీల దాడి

యెమెన్‌పై దాడులు ఆపకపోతే మరింతగా విరుచుకుపడతాం

సౌదీ అరేబియాకు వార్నింగ్



రియాద్ అక్టోబర్ 14 మహా ప్రభ

సౌదీ అరేబియాలో హౌతీల దాడులు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. సౌదీ అరేబియాలోని తూర్పు నగరం ధహ్రాన్‌లో ఉన్న ఆ దేశ జాతీయ చమురు సంస్థ అరామ్‌కో ప్రధాన కార్యాలయంలోని ఓ పరిపాలనా భవనంపై మీద మంగళవారం హౌతీలు బాలిస్టిక్ క్షిపణులు,క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేశారు. ఈ విషయాన్ని ఆ దేశ ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. బిల్డింగ్‌లోని పై మూడు అంతస్తులు దెబ్బతిన్నాయని, ఇందులో సీఈవో కార్యాలయం కూడా ఉందని చెప్పింది. ఈ దాడిలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, మంటలను వెంటనే ఫైర్ సిబ్బంది అదుపుచేసినట్లు అధికారులు చెప్పారు. చమురు కేంద్రాలకు సిబ్బంది, పౌరులు దూరంగా ఉండాలని హౌతీలు ప్రకటించిన కొద్ది సేపటికే ఈ **దాడి జరిగింది.దాడులు కొనసాగిస్తాం..**

చమురు సంస్థలు తమకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని.. అందుకే తమకు అవి దాడి చేసే లక్ష్యాలుగా ఉన్నట్లు హౌతీలు చెప్పారు. సౌదీలోని ఎయిర్‌పోర్టులు, చమురు కేంద్ర సంస్థలపై దాడులను కొనసాగిస్తామని హెచ్చరించారు. యెమెన్ మీద సౌదీ దాడులు ఆపకపోతే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని.. సాధారణ పౌరులు తాము ఎంచుకున్న లక్ష్యాలకు దూరంగా ఉండాలని హౌతీలు కోరారు.

బయటకు రాకండి..

సౌదీలో వైమానిక దాడులు జరిగే సమయంలో ఇండ్లలోనే ఉండాలని, బయటకు రావొద్దని సౌదీలోని భారత ఎంబసీ సూచించింది. ఎంబసీ అధికారులు జారీచేసే హెచ్చరికలు, సూచనలు పాటించాలని చెప్పింది. దాడులకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని తెలిపింది. ఎలాంటి సహాయం కావాలన్నా ఎంబసీకి కాల్ చేసి చెప్పాలని కోరింది. సౌదీ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతున్నామని చెప్పింది.

జర్మనీలో అగ్నిప్రమాదం.. భారతీయుల మృతి



బోచుమ్ (జర్మనీ),అక్టోబర్ 14 మహా ప్రభ

జర్మనీలోని బోచుమ్ నగరంలో హోస్ట్‌ఫెడ్ ప్రాంతంలో మంగళవారం ఒక నివాస భవనంలో అనుమానాస్పద స్థితిలో జరిగిన అగ్నిప్రమాదంలో మూడో అంతస్తులోని ముగ్గురు భారతీయులు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. ఇది హత్యగా అనుమానించిన పోలీసులు అదే భవనంలో నివసిస్తున్న 41 ఏండ్ల వ్యక్తిని అరెస్ట్ చేశారు. అయితే మృతుల, క్షతగాత్రుల వివరాలను అధికారులు వెల్లడించ లేదు. అరెస్టయిన వ్యక్తి రొమేనియా దేశస్తుడని మీడియా తెలిపింది.

అజర్‌బైజాన్ బడుల్లో హిజాబ్‌పై నిషేధం!



బాకు, అక్టోబర్ 14 మహా ప్రభ

: దేశంలో 96 శాతం ముస్లిం జనాభా ఉన్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల డ్రెస్‌కోడ్‌లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై విద్యార్థినులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయంపై మండిపడ్డ విద్యార్థినులు తరగతులు బహిష్కరించి నిరసనలు జరిపారు'హిజాబ్ పాపం కాదు.. ఒక దేవదూత' అని నినాదాలు చేశారు. అజర్‌బైజాన్ జనాభాలో 96 శాతం ముస్లింలు, వీరిలో షియాలు మెజారిటీ కాగా, సున్నీలు కూడా అధికంగానే ఉంటారు. అయినప్పటికీ తమది లౌకిక దేశంగా అజర్‌బైజాన్ ప్రకటించుకుంది.

బాలికపై రోబో లైంగిక వేధింపులు!



కొలోన్ : అక్టోబర్ 14 మహా ప్రభ

ఒక రోబో 16 ఏండ్ల బాలికను తడిమి లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జర్మనీలోని కొలోన్‌లో శనివారం చోటుచేసుకుంది. ఈ రోబో పోలీసుల అదుపులో ఉంది. నాలుగు అడుగుల ఎత్తున్న ఈ హ్యూమనాయిడ్ రోబో బాలిక వెనుక ఆమెను తడమడమే కాక, అసభ్య కదలికలు చేసింది. ఈ రోబోను రిమోట్ ద్వారా నియంత్రిస్తున్న ఇద్దరు బాలురు ఈ దృశ్యాన్ని లైవ్ స్ట్రీమింగ్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.దీంతో పోలీసులు రోబోతో పాటు 16, 19 ఏండ్ల ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. స్నేహితులతో వచ్చిన ఆ అమ్మాయి పామ్‌స్ట్రాస్‌లోని ఒక ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో ఉండగా ఈ ఘటన జరిగింది. ఆ బాలికపై ఉద్దేశపూర్వకంగా రోబోతో లైంగిక వేధింపులకు ప్రయత్నించారా అన్న విషయాన్ని దర్యాప్తు చేస్తున్నామని వారు చెప్పారు.

మళ్లీ నిరసనలకు సీజేపీ పిలుపు

-అక్టోబర్ 16న 'లెట్రో దో తిరంగా' పేరుతో ఆందోళన
-సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
-ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద కార్యక్రమం
-జాతీయ జెండాలతో రావాలని అభిజీత్ దీప్కే పిలుపు
-నేతలు జైలులో ఉండటంపై ప్రభుత్వంపై విమర్శలు
-తిరంగా ఊపడం నేరమా అంటూ ప్రశ్న
-ఢిల్లీకి రాలేనివారు స్వస్థలాల్లోనే నిరసనలు చేయాలని సూచన
-సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలు తిహార్ జైలులో



న్యూఢిల్లీ:
ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మరోసారి నిరసనలకు సీజేపీ పిలుపునిచ్చింది. అక్టోబర్ 16న శుక్రవారం 'లెట్రో దో తిరంగా' పేరుతో ఆందోళన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బుధవారం ప్రకటించారు. జాతీయ జెండాను ఊపుతూ నిరసన తెలిపే ఈ కార్యక్రమాన్ని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పాల్గొనేవారు జాతీయ జెండాలతో రావాలని కోరారు. తిరంగా జెండాను ఊపడం నేరమా అని దీప్కే ప్రశ్నించారు. జెండా ఎగురవేసినందుకే తమ పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను జైలులో పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీసులు, కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఢిల్లీలో అనుమతి లేకుండా నిరసన నిర్వహించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించారనే ఆరోపణలపై సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం వారిద్దరూ తిహార్ జైలులో ఉన్నట్లు సమాచారం. వారిని వేర్వేరు గదుల్లో ఉంచినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అక్టోబర్ 16న ఢిల్లీలో నిర్వహించే తిరంగా కార్యక్రమంలో మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని దీప్కే పిలుపునిచ్చారు. ఢిల్లీకి రాలేని వారు తమ సొంత ప్రాంతాల్లోనే జాతీయ జెండాలతో తిరంగా మార్చ్ నిర్వహించాలని సూచించారు. జెండాను ఊపడం నేరం కాదని నిరూపించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ చేపడుతున్న నిరసనలను ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. గతంలో అనుమతులు, పోలీసు చర్యల కారణంగా పార్టీ కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురయ్యాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజా ఆందోళనకు ఎలాంటి స్పందన లభిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

సింగరేణి కార్మికులు తిరగబడితే దక్షిణాది రాష్ట్రాలు చీకట్లోనే!

మొదటి తరువాయి

ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని, మరికొందరు శాశ్వత వైకల్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి చీకటి గుహల్లో పనిచేసే సింగరేణి కార్మికుల ధైర్యసాహసాలు అసాధారణమని కొనియాడారు. బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా ఉద్యమాల్లోనూ కార్మికులు ముందుంటారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునకు సింగరేణి కార్మికులు పెద్ద ఎత్తున స్పందించారని కేటీఆర్ పేర్కొన్నారు. సకల జనుల సమ్మెలో భాగంగా ఒకసారి 35 రోజులు, మరోసారి ఏడు రోజులు కలిపి మొత్తం 42 రోజులపాటు కార్మికులు సమ్మె చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన పోరాటానికి సింగరేణి కార్మికులు బలమైన మద్దతుగా నిలిచారని చెప్పారు. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన సమయంలోనూ సింగరేణి కార్మికులు ఉద్యమంలో ముందుండి నడిచారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ తెలంగాణ జెండా ఎత్తుకుని ముందుకు సాగితే, కార్మికులు ఆయనకు అండగా నిలిచారని అన్నారు. తెలంగాణ కోసం తమ ఉపాధి, రోజువారీ పనులను పక్కనపెట్టి పోరాడిన కార్మికుల త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని పేర్కొన్నారు. సాధారణంగా కార్మిక సంఘాలు వేతనాలు, బోనస్‌లు, హక్కుల కోసం పోరాడుతాయని కేటీఆర్ అన్నారు. అయితే తెలంగాణలోని సింగరేణి కార్మికులు తమ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించడం ప్రత్యేకమని పేర్కొన్నారు. గోదావరిఖని ప్రాంతం కార్మిక పోరాటాలకు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. సింగరేణి కార్మికుల కృషి, త్యాగాలు రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నట్టూ.. మళ్లీ సన్‌రైజర్స్‌కు!

- ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి నటరాజన్‌ను ట్రేడ్ చేసుకున్న హైదరాబాద్
- రూ.5 కోట్ల ధరతో పాత జట్టులోకి యార్కర్ కింగ్
- స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీకి ఇచ్చిన ఎస్ఆర్‌హెచ్



ముంబై
యార్కర్ కింగ్ టి. నటరాజన్ మళ్లీ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులోకి వచ్చాడు. క్రికెట్ అభిమానులు ముద్దుగా 'నట్టూ' అని పిలుచుకునే ఈ లెఫ్టార్మ్ పేసర్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి సన్‌రైజర్స్ ట్రేడ్ చేసుకుంది. అతడికి బదులుగా స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీ జట్టుకు అప్పగించింది.2020 నుంచి 2024 వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన నటరాజన్ కీలక బౌలర్‌గా గుర్తింపు పొందాడు. తన పదునైన యార్కర్లతో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందిపెట్టే నట్టూ, ఇప్పుడు మరోసారి పాత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రూ.5 కోట్ల ధరతో అతడు సన్‌రైజర్స్‌లో చేరగా, జీషన్ అన్సారీ తన కనీస ధర రూ.40 లక్షలకే ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ఆడనున్నాడు.

మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

మొదటి తరువాయి

ఆధారపడే స్థితి నుంచి ఎదిగి, సమాజాన్ని శాసించే స్థాయికి చేరుకోవాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. మహిళల సాధికారత, ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బతుకమ్మ కేవలం పండుగ మాత్రమే కాదని, తెలంగాణ పూర్వీకులు అందించిన గొప్ప సాంస్కృతిక వారసత్వమని మంత్రి పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, చెరువులను పూజిస్తూ, రంగురంగుల పూలతో అమ్మవారిని కొలవడం ఈ పండుగ ప్రత్యేకత అని వివరించారు. ఆడబిడ్డ అమ్మగారింటికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆత్మీయతను పంచుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపే అపురూపమైన వేడుక బతుకమ్మ అని అన్నారు. తెలంగాణలోనే కాకుండా దేశవిదేశాల్లో నివసిస్తున్న తెలంగాణ మహిళలు సైతం బతుకమ్మను ఘనంగా జరుపుకోవడం మన సంస్కృతి గొప్పతనానికి నిదర్శనమని సీతక్క తెలిపారు. ఆస్తులు కోల్పోతే తిరిగి సంపాదించుకోవచ్చని, పదవులు పోతే మళ్లీ పొందవచ్చని, కానీ కనుమరుగైన సంస్కృతి సంప్రదాయాలను తిరిగి తీసుకురావడం కష్టమని అన్నారు. పూర్వీకులు అందించిన ఆటపాటలు, సంప్రదాయాలే మహిళలకు గొప్ప ఆస్తులని పేర్కొన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి కోసం ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. బతుకమ్మ వంటి పండుగలు మహిళల్లో ఐక్యత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెబుతాయని సీతక్క అన్నారు.

యువతే పారిశ్రామిక శక్తి!

మొదటి తరువాయి

ఆఫ్ కామర్స్‌ను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సాంకేతిక మార్పులు, నూతన విధానాలు, చట్టాలపై యువతకు అవగాహన ఉండాలని సీఎం సూచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలతో పాటు అంతర్జాతీయ పరిణామాలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారిని ఒకే వేదికపై కలుసుకునే అవకాశం ఇలాంటి సదస్సుల ద్వారా లభిస్తుందని, వారి అనుభవాలు యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు పారిశ్రామిక, రాజకీయ, న్యాయ, సినీ రంగాల్లో సాధించిన విజయాలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయడం ద్వారా యువతకు స్ఫూర్తినివ్వవచ్చని పేర్కొన్నారు. భారతదేశానికి 2047 సంవత్సరం ఎంతో కీలకమని రేవంత్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే నాటికి దేశం సాధించిన ప్రగతిని సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్ లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన ప్రణాళికలు అవసరమని చెప్పారు. భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్--2047 లక్ష్యాన్ని చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం 2025లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్--2047 గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర అభివృద్ధికి నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించి, విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసిందని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ ఆర్థిక విభాగాలుగా విభజించి, ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా, వనరులకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని సుమారు 2,100 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 1.34 కోట్ల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)ను గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని కలిగించే పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించి, నగరంలో సేవల రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. పరిశ్రమల తరలింపునకు అవసరమైన రాయితీలు, అనుమతులు, ఇతర సహకారం అందించేందుకు హిల్ట్ విధానాన్ని తీసుకొచ్చామని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఓఆర్ఆర్ కీలక పాత్ర పోషించిందని సీఎం అన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాల వల్ల ఐటీ, ఔషధ, విద్య, సేవల రంగాలు విస్తరించి నగరం నాలెడ్జ్ హబ్‌గా ఎదిగిందని పేర్కొన్నారు. ఇదే తరహాలో ఓఆర్ఆర్ వెలుపల సుమారు 50 కిలోమీటర్ల పరిధిలో 360 కిలోమీటర్ల మేర రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న సుమారు 10,500 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్)గా గుర్తించి, తయారీ పరిశ్రమల కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాంతంలో స్టార్టప్‌లు, కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు యువ పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఆర్ఆర్ఆర్ నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఉన్న సుమారు లక్ష చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని గ్రామీణ వ్యవసాయ ఆర్థిక ప్రాంతంగా (రేర్) అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలంటే ప్రణాళికలతో పాటు వాటి అమలుకు అవసరమైన పెట్టుబడులు, కార్యాచరణ కీలకమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టి తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీపడే స్థాయికి హైదరాబాద్‌ను తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్న భారతీయులు సొంతంగా స్టార్టప్‌లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళల భాగస్వామ్యం పెరిగిన దేశాలు ఆర్థికంగా పురోగమిస్తున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భారత్‌లోనూ మహిళల పారిశ్రామిక భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. యువత, మహిళలకు సమాన అవకాశాలు కల్పిస్తే పారిశ్రామిక రంగంలో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని చెప్పారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ఎంపీలు డాక్టర్ కె. లక్ష్మణ్, వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

రైళ్లలో స్పీకర్ ఆన్ చేసి మొబైల్ చూస్తే 1,000 ఫైన్

రైళ్లలో శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు
పెద్ద శబ్దంతో పాటలు వింటే, వీడియోలు చూస్తే ఇబ్బందులు
తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే జరిమానా
హెచ్చరికలను పట్టించుకోకపోతే కఠిన చర్యలు
కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్షకు అవకాశం



హైదరాబాద్,
రైలు ప్రయాణాల్లో తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించే శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు రైల్వే శాఖ చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఇకపై రైళ్లలో మొబైల్ ఫోన్ స్పీకర్ ఆన్ చేసి పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటం, ఫోన్‌లో గట్టిగా మాట్లాడటం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇతర ప్రయాణికులకు అసౌకర్యం కలిగించే వారిపై రూ.1,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. ైళ్లలో ప్రయాణించే సమయంలో కొందరు మొబైల్ ఫోన్లలో పెద్ద శబ్దంతో పాటలు వినడం, వీడియోలు చూడటంతో ఇతర ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరహా ఘటనలపై ఫిర్యాదులు పెరుగుతుండటంతో రైల్వే అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణికుల నిద్రకు భంగం కలగకుండా చూడటంపై దృష్టి సారిస్తున్నారు. హెచ్చరికలు చేసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తే పరిస్థితిని బట్టి మరింత కఠినమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇండియన్ రైల్వేస్ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం కొన్ని సందర్భాల్లో ఆరు నెలల వరకు జైలు శిక్ష, రూ.5,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రైల్వే స్టేషన్లలోనూ శబ్దానికి సంబంధించిన నిబంధనలను అమలు చేయనున్నట్లు సమాచారం. ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో పాటలు వినాలన్నా, వీడియోలు చూడాలన్నా ఇయర్‌ఫోన్లు లేదా హెడ్‌ఫోన్లు ఉపయోగించాలని రైల్వే అధికారులు సూచిస్తున్నారు. ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా తక్కువ శబ్దంతో మాట్లాడి ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

కాశీ ఆలయంలో బంగారం మాయం!

వారణాసి
అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల అవకతవకలపై అభాసుపాలైన యూపీ బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు కాశీ విశ్వనాథ ఆలయంలోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని ప్రసిద్ధ కాశీ విశ్వనాథుని ఆలయంలో బంగారం చోరీకి గురైందంటూ ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. వారణాసి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి, న్యాయవాది నిత్యానంద్ రాయ్ ఈ విషయమై ప్రధానమంత్రి కార్యాలయానికి(పీఎంఓ) లేఖ రాశారు. ఆలయ శిఖరంతో పాటు, పలు ప్రాంతాల్లో బంగారం కనిపించడం లేదని, ఆలయ యాజమాన్యం ఆ ప్రదేశాలకు రంగులు వేసి, విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.



బ్లూ డ్రమ్ హత్య కేసులో ముస్కాన్, సాహిల్‌కు మరణశిక్ష

ముంబై
: దేశంలో సంచలనం సృష్టించిన మీరట్, బ్లూడ్రమ్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిందితులు ఇద్దరికీ మరణశిక్ష విధిస్తూ మీరట్‌కు చెందిన జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ మేరకు జిల్లా కోర్టు జడ్జి అరవింద్ కుమార్ మిశ్రా తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణ గత సెప్టెంబర్ 30న పూర్తికాగా.. నిందితులు ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా నేరానికి పాల్పడ్డట్లు తేలింది.దీంతో ఆరోజు తీర్పు రిజర్వ్ చేయగా, నేడు తీర్పు వెల్లడించారు. ఈ ఘటనలో హత్యకు గురైంది రస్తోగి భర్త సౌరభ్ భరద్వాజ్. తీర్పు వెలువడుతున్న సమయంలో జిల్లా జైలులో ఉన్న నిందితులు ఇద్దరూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. బ్లూ డ్రమ్ హత్యకు సంబంధించిన పూర్తి వివరాలివి. ఉత్తర ప్రదేశ్, మీరట్‌కు చెందిన నేవీ మాజీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్.. 2025, మార్చి 3న హత్యకు గురయ్యాడు. అతడి భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా కలిసి సౌరభ్‌ను హత్య చేశారు. తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో సౌరభ్‌ను హత్య చేశారు. అనంతరం అతడి మృతదేహాన్ని ముక్కలుగా చేసి, ఒక బ్లూ డ్రమ్‌లో ఉంచారు. పైనుంచి సిమెంట్ పోసి, కప్పేశారు. దీంతో అతడి మృతదేహం అందులోనే కూరుకుపోయింది. ఘటన జరిగిన కొన్ని రోజులకు పోలీసులు అన్ని కోణాల్లో విచారించగా ఈ హత్య ఘటన బయటపడింది. సౌరభ్‌ను ముస్కాన్, ఆమె క్లాస్‌మేట్, ప్రియుడు సాహిల్ కలిసి హత్య చేసినట్లు తేలింది. దీనిపై గత ఏడాది జూలైలో విచారణ ప్రారంభమైంది. మొత్తం 13 నెలల్లోనే ఈ కేసు విచారణ పూర్తై, తీర్పు వెలువడటం విశేషం. ఈ కేసులో 126 వాదోపవాదాలు జరిగాయి.

రైల్వే ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త

-78 రోజుల దసరా బోనస్‌కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
-11.40 లక్షల మందికి పైగా ఉద్యోగులకు లబ్ధి
-బోనస్ కోసం రూ.2,009 కోట్లు కేటాయింపు
-ఒక్కో ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చెల్లింపు
-నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు వర్తింపు
-ట్రాక్‌మెన్ నుంచి లోకోపైలట్ల వరకు ప్రయోజనం



ముంబై
రైల్వే శాఖ ఉద్యోగులకు మోదీ ఆధ్వర్యంలోని ప్రభుత్వం శుభవార్త అందించింది. రైల్వే ఉద్యోగులకు 78 రోజుల దసరా బోనస్ ప్రకటిస్తూ మోదీ క్యాబినెట్ బుధవారం నిర్ణయం తీసుకుంది. ఈ బోనస్ మొత్తం విలువ రూ.2,009 కోట్లుగా ఉంది. పీఎల్‌బీ (ప్రొడక్టివిటీ లింకుడ్ బోనస్) కింద ఉద్యోగులకు ఈ మొత్తం రైల్వే శాఖ చెల్లించనుంది. ఈ నిర్ణయం ద్వారా 11,40,770 మంది రైల్వే నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రతి ఏడాది దసరా సందర్భంగా రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ప్రకటిస్తుంటుంది. ఈ ఏడాది 78 రోజుల బోనస్ ప్రకటించింది. ఒక ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 వరకు అందుతాయి. 78 రోజుల బోనస్ అయినప్పటికీ.. చెల్లింపులపై పరిమితి వల్ల ఈ మొత్తం తక్కువగా ఉంటుంది. దీనిద్వారా ట్రాక్ మెయింటెనర్స్, స్టేషన్ మాస్టర్స్, ట్రైన్ మేనేజర్లు, టెక్నీషియన్లు, లోకోపైలట్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్ హెల్పర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, పాయింట్‌మ్యాన్‌తోపాటు ఇతర గ్రూప్-సి సిబ్బందికి బోనస్ అందుతుంది. బోనస్ ప్రకటన సందర్భంగా కేంద్ర క్యాబినెట్ కీలక వ్యాఖ్యలు చేసింది. 2025-26 రైల్వే శాఖకు చాలా మంచి సమయం అని, ఈ సమయంలో రైల్వే శాఖ 1,670 మిలియన్ టన్నుల కార్గోను రవాణా చేసిందని తెలిపింది. అలాగే, ఇదే కాలంలో 7.41 బిలియన్ల మంది ప్రయాణికులు రైళ్లో ప్రయాణించారు. ఇక, ఫేక్ బోనస్ లెటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని రైల్వే బోర్డు సంబంధిత ఉద్యోగులకు సూచించింది. మరోవైపు తమకు డీఏ పరిమితిని గరిష్ఠంగా రూ.18,000 నుంచి పెంచాల్సిందిగా ఇండియన్ రైల్వేస్ టెక్నికల్ సూపర్‌వైజర్స్ అసోసియేషన్ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. లెవల్2, ఆపై ఉద్యోగులకు వర్తించేలా చూడాలని కోరింది.

కేంద్రంలో అధికారం కాంగ్రెస్‌దే!

మొదటి తరువాయి

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఎన్నికల వ్యూహంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ తరహాలోనే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్ సూచించినట్లు పేర్కొన్నారు. మహిళా జర్నలిస్టులను రాహుల్‌గాంధీ అవమానించారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. మహిళలు, పెద్దల పట్ల రాహుల్‌కు ఎంతో గౌరవం ఉందని అన్నారు. గతంలో మల్లికార్జున ఖర్గేకు షూలేస్ కట్టుకునేందుకు ఇబ్బంది ఎదురైనప్పుడు రాహుల్ స్వయంగా సహాయం చేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును అడ్డుకోవడం సరికాదని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా ఎవరైనా పోరాటం చేస్తే కాంగ్రెస్ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కేసీఆర్ కుటుంబానికి చెందిన ఫాంహౌస్‌లపై దాడులు చేయడం తమ ఉద్దేశం కాదని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. తాము నీతిమంతులమని చెప్పుకునే నాయకుల వ్యవహారాలను ప్రజల ముందు ఉంచేందుకే ఫాంహౌస్‌ల అంశాన్ని ప్రస్తావిస్తున్నామని అన్నారు. అయోధ్య రామమందిరం భూమిపూజకు సంబంధించిన చరిత్రను గుర్తుచేస్తూ, ఆ అంశాన్ని బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిందని, సంపన్నులకే ఎక్కువ ప్రయోజనాలు కలుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి కార్మికుల అంశంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను ఆయన తప్పుబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వం కార్మికులకు ప్రయోజనాలు కల్పిస్తోందని చెప్పారు. ఎల్‌నినో అనేది ప్రకృతి సంబంధిత పరిణామమని, ప్రపంచవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొంటున్నాయని పేర్కొన్నారు. ప్రతి అంశాన్నీ రాజకీయాలకు ఉపయోగించుకోవడం బీఆర్ఎస్‌కు తగదని హితవు పలికారు. బీజేపీకి వ్యతిరేకంగా యువత చేపడుతున్న పోరాటాలు చారిత్రాత్మకమని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశంసించారు. కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు ప్రజా సమస్యలపై తమదైన రీతిలో పోరాడుతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో 15 ఏళ్లుగా గుర్తింపు సంఘం ఎన్నికలు జరగలేదని, అందుకే తమ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ముందుకొచ్చిందని చెప్పారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓటమి పాలైనంత మాత్రాన నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, గెలుపోటములు సహజమని వ్యాఖ్యానించారు.

సంపాదకీయం

కరువుపై కాంగ్రెస్ సర్కార్ చోద్యం



ఎల్ నినో అంటే కేవలం వాతావరణ పరిణామం కాదు, అది వ్యవసాయం, నీటి భద్రత, ఆహార భద్రత, ప్రజల జీవనంపై ప్రభావం చూపే సవాల్. కానీ ప్రభుత్వం ఎల్ నినో హెచ్చరికకలను లెక్క చేయకుండా సంక్షోభం వచ్చే వరకు కాలయాపన చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయంలో విలువైన సమయం వృథా చేసింది. సాగు, తాగునీటి భద్రతపై చర్యలు చేపట్టలేదు. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఎల్ నినో గతంలో నమోదైన అత్యధిక స్థాయిని మించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరమున్నది. లేకపోతే సాగు ఆగమై, ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది. కరువు ఒక రంగానికి సంబంధించిన సమస్య కాదు. సాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, తాగునీరు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అన్నింటినీ ప్రభావితం చేసే గొలుసు ప్రభావం. ఈ ప్రమాదం రానున్నదని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలుసు. కరువును ఎదుర్కొనేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. అసలు ప్రశ్న ప్రభుత్వం హెచ్చరికను గుర్తించిందా లేదా అనేదే ముఖ్యం కాదు, ఆ హెచ్చరికకు తగిన వేగంతో చర్యలు తీసుకుంటున్నదా అనే ముఖ్యం. తెలంగాణకు ఆధారమైన అతిపెద్ద సహజ వనరు గోదావరి. ముఖ్యంగా ప్రాణహితగోదావరి సంగమం తర్వాత కన్నేపల్లి ప్రాంతంలో అందుబాటులోకి వచ్చే నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలి. కానీ ఈ విషయంలో ప్రభుత్వం విలువైన సమయాన్ని కోల్పోయింది. గోదావరిలో లభిస్తున్న నీటిని సాధ్యమైన మేరకు వినియోగించుకోవాలని, కన్నేపల్లి పంప్ హౌస్‌తోపాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వ్యవస్థలో సురక్షితంగా ఉపయోగించగల భాగాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని వానకాలం ప్రారంభంలోనే రిటైర్డ్ ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు సూచించారు. కానీ ప్రభుత్వం పెడచెవినపెట్టింది. మరోవైపు కండ్లముందుగా ప్రవహిస్తున్న గోదావరి నీటిని సురక్షితంగా వినియోగించుకునే అవకాశాలను కోల్పోవడం పరిపాలనా దూరదృష్టి లోపంగానే కనిపిస్తున్నది. ఎల్ నినో ప్రభావం తీవ్రమైతే ప్రభుత్వం పంటలు, జిల్లాల వారీగా నీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ఇప్పటికే సాగులో ఉన్న పంటలను ముందుగా రక్షించాలి. ఏ ప్రాజెక్టులో ఎంత నీరున్నది? ఆ ప్రాజెక్టుల కింద ఎంత ఆయకట్టు ఉన్నది? ఎంత నీరు అవసరం ఉన్నది? అనే వివరాలను ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలి. అంతేకాకుండా చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల సంరక్షణ వంటి చర్యలను చేపట్టాలి. రైతులకు కేవలం సలహాలు ఇవ్వడం సరిపోదు. నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళికను రూపొందించి, ఆ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సాయం అందించాలి. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గితే గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల మీదా ఒత్తిడి పెరుగుతుంది. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి వేసవిలో తాగునీటి అవసరం మరింత పెరుగుతుంది. అందువల్ల ప్రభుత్వం తాగునీటి భద్రతా ప్రణాళిక రూపొందించాలి. ప్రతి ప్రధాన రిజర్వాయర్లో ప్రస్తుతం ఎంత నీరు ఉన్నది? సాధారణ వినియోగంతో అది ఎన్ని నెలలకు సరిపోతుంది? ప్రత్యామ్నాయ వనరులు ఏమిటి? అత్యవసర పరిస్థితిలో ఏ వనరుల నుంచి నీటిని తీసుకురావచ్చు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. హైదరాబాద్‌తోపాటు అన్ని మున్సిపాలిటీలకు ప్రధాన నీటి వనరు, ప్రత్యామ్నాయ వనరు, అత్యవసర వనరు అనే మూడు స్థాయిల నీటి భద్రతా వ్యవస్థ ఉండాలి. వర్షాభావ పరిస్థితుల్లో విద్యుత్తు రంగం మీదా ప్రభావం పడుతుంది. నీటి కొరత వల్ల జల విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో వేసవి వేడి పెరిగితే గృహాలు, వ్యవసాయం, పరిశ్రమల నుంచి విద్యుత్తు డిమాండ్ పెరుగుతుంది. కాబట్టి విద్యుత్తు కొనుగోలు, థర్మల్ విద్యుత్తు ఉత్పత్తికి అవసరమైన ఇంధన నిల్వలు, వ్యవసాయానికి నిరంతర సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే లేదా ఏర్పాటు చేసిన వార్ రూమ్ కేవలం అధికారుల సమావేశాలకు పరిమితం కాకూడదు. ప్రతి వారం ప్రజలకు ఒక స్పష్టమైన పరిస్థితి నివేదిక ఇవ్వాలి: జిల్లాల వారీగా వర్షపాతం, ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు, గోదావరి, కృష్ణా నదుల ప్రవాహాలు, తాగునీటి లభ్యత, సాగునీటి విడుదల, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భజల పరిస్థితి, విద్యుత్తు డిమాండ్, సరఫరా వంటి అంశాలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి. రానున్న వారాల్లో వాతావరణ అంచనాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఈ సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎల్ నినో అనేది ప్రకృతి పరిణామం. దాని ప్రభావాన్ని ఎంతవరకు తగ్గించగలమో అని అలోచించాల్సింది మాత్రం ప్రభుత్వమే. ప్రజలపై కరువు ప్రభావం ఏ మేరకు పడుతుంది అనేది పాలక పెద్దలు తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉంటుం ది. అందుకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణకు ఒక్కరోజు కూడా ఆలస్యం చేయకూడదు. పనులకు కచ్చితమైన గడువు నిర్ణయించి, పురోగతిని ప్రజలకు తెలియజేయాలి. నీటి భద్రతను వాయిదా వేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. కొన్ని నెలల్లో రాజకీయ వివాదాలు, పరస్పర ఆరోపణలు, అనవసరమైన అంశాలపై సమయం కేటాయించిన పాలకులు, నీటి సమస్య పరిష్కారం మీదా దృష్టి పెట్టాలి. ఇప్పటికే తగిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ కాంగ్రెస్ పాలక పెద్దలు ఆ దిశగా ఎందుకు పట్టించుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. అది మాటలతో కాదు, చేతల్లోనే చూపించాలి. అదే ప్రభుత్వం ముందున్న తక్షణ బాధ్యత. ఇన్నాళ్లూ కరువుపై చోద్యం చూసిన పాలకులు ఇకనైనా స్పం దించాలి. కరువును ఏ విధంగా ఎదుర్కొంటారో కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం..





-అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు: ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

-దేవరకద్రలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

-రేషన్ కార్డుల పంపిణీతో పాటు రైతులకు ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ





దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 14 మహా ప్రభ

దేవరకద్ర: పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడంతో పాటు స్మార్ట్ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు.

దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో దేవరకద్ర మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు ఉచితంగా వేరుశనగ విత్తనాలను అందించారు.

హామీల అమలే ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు సుమారు రూ.6,500 కోట్ల వడ్డీలు చెల్లిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని విమర్శించారు. దేవరకద్ర పట్టణంలో రైల్వే అండర్‌పాస్ నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, గత పాలకులు తీసుకున్న నిర్ణయాల వల్ల రైల్వే బ్రిడ్జి నిర్మాణం జరిగి పట్టణం రెండు భాగాలుగా విడిపోయిందని ఆరోపించారు. దీనివల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పనులు

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కళాశాల, కోర్టు, పూర్తిస్థాయి ఆసుపత్రి ఏర్పాటు చేయలేకపోయారని ఎమ్మెల్యే విమర్శించారు. దేవరకద్ర పట్టణానికి మున్సిపాలిటీ హోదా కూడా కల్పించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవరకద్రలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశామని, కోర్టును అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసి, పనులు వేగంగా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్రహ్మోస్ క్షిపణుల తయారీ యూనిట్‌ను దేవరకద్రకు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన భూసేకరణ పూర్తయిందని ఎమ్మెల్యే తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా 5.60 లక్షల రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు, 26 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డుల్లో చేర్చిందని జీఎంఆర్ వివరించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీకి ఏడాదికి రూ.13 వేల కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరగలేదని విమర్శించారు. గతంలో మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు రేషన్ కార్డు కీలకమని, పేద కుటుంబాలకు అది కేవలం గుర్తింపు పత్రమే కాకుండా ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. గతంలో రేషన్ కార్డులు లేక అనేక మంది పేదలు సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమయ్యారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు

దేవరకద్ర నియోజకవర్గంలో ఇప్పటికే మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం గుడిసెల్లో నివసిస్తున్న అర్హులను గుర్తించి రెండో విడతలో ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చిలో మూడో విడత ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు వెయ్యి రోజుల్లో చేసి చూపించిందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యమిస్తోందని జీఎంఆర్ తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వావలంబన కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు అనవసర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం కంటే స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని ఆరోపించారు. ఆ పార్టీ నాయకుల వ్యవహారశైలిపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ఆశలు నెరవేరవని, ఆ పార్టీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, మహిళా సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, కౌన్సిలర్లు కురువ బీరప్ప, రామాంజనేయులు, భీమన్న, బాలరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ హర్షత్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూనీటి అంజన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

-ఆటపాటలతో అలరించిన చిన్నారులు, భక్తులు



కొడంగల్, అక్టోబర్14(మహాప్రభ

వికారాబాద్ జిల్లా, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్ మండలం సుల్తాన్‌పూర్ గ్రామంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా దుర్గామాత పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సుల్తాన్‌పూర్ గ్రామంలో వెలసిన అమ్మవారికి బాలపోల్లా నర్సిములు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజ నిర్వహించడం జరిగింది.అలాగే గ్రామ ప్రజలు పూజ నిర్వహించి హారతులు సమర్పించారు.?ఉత్సవాల్లో భాగంగా గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తూ, దాండియా, కోలాటం వంటి ఆటలు ఆడుతూ సందడి చేశారు. గ్రామమంతా అమ్మవారి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది.పూజా కార్యక్రమంలో భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ చేపట్టారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

- పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్



పాపన్నపేట, అక్టోబర్14(మహాప్రభ)

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతారని పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని కుర్తివాడ గ్రామానికి చెందిన కాదురి గోపాల్ కుమారుడు సాయి తేజ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన స్మారకర్థం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ వాలీబాల్ టోర్నమెంట్లో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఖాళీ సమయాన్ని యువత మైదానంలో గడపాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యువత రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు నిర్వాహకులు, దాతలు, గ్రామ సర్పంచ్ శ్రీధర్ తో కలిసి నగదు బహుమతితోపాటు ట్రోఫీని అందజేశారు. ప్రథమ విజేతకు రూ.6,000 మరియు ద్వితీయ విజేతకు రూ. 3,000 నగదు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ శ్రీధర్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువులో, క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ కు సహకరించిన దాతలను, పీఈటీలను, ప్రజా ప్రతినిధులను, ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్, పీఈటీలు ప్రభాకర్, కుమార్, రవి, శ్రీకాంత్, రాజా గౌడ్ తదితరులు, సాయి తేజ మిత్రులు, నిర్వాహకులతో పాటు దాతలు మాజీ సర్పంచ్ స్రవంతి శ్రీనివాస్, బాపురావు, బైండ్ల సత్యనారాయణ, పెంటన్నోళ్ల సతీష్, కొండయ్యల భాగయ్య, ఉప సర్పంచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన శ్రీ తుల్జా భవాని అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ .



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 14 (మహాప్రభ)
డిండి మండల పరిధిలో ఉమ్మడి వీరబోయన పల్లి గ్రామ పంచాయతీ ప్రస్తుత శక్రుతండాగ్రామపంచాయతీ పరిధిలో బుధవారం నూతనంగా నిర్మించి నూతన శ్రీతుల్జాభవాని అమ్మవారి ఆలయంనికి ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారిని శాలువాతో సత్కరించారు.ఈకార్యక్రమంలో శక్రూ తండా సర్పంచ్ కేతవత్ బాధ్య నాయక్, రామావత్ రెడ్యానాయక్, నారాయణ సింగ్, తావుర్య, రమేష్ నాయక్ ,దశరథ్ ,రంజిత్ ,గన్య,లక్ష్మణ్ ,యాకూబ్ ,పుల్ సింగ్ ,శంకర్ ,నేనావత్ శ్రీను, శ్రీను, శంకర్,రవీందర్, సిత్య, పాండు, తిరుపతి, నిరంజన్, దేవీలాల్, రెక్కీ లాల్,దశరథం,శివకుమార్, తండా ప్రజలు పాల్గొనారు

దేవరకొండ మండలం గొట్టిముకుల గ్రామంలో ఎం ఆర్ పి ఎస్ నూతనకమిటి ఎన్నిక.



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 14 (మహాప్రభ)
దేవరకొండ.మండలంగొట్టిముక్కుల గ్రామశాఖనూతన అధ్యక్షులు గా కుక్కముడి అంజయ్యమాదిగనిఎన్నుకోవడంజరిగింది.అధికారప్రతినిధి కుక్కముడి వెంకటయ్య మాదిగ ఉపాధ్యక్షులుగా జోగురాములు మాదిగ ప్రధాన కార్యదర్శి గా జోగు వెంకటేషమాదిగకార్యదర్శులుగా కుక్కల కోటేష్ కుక్క ముడి వెంకటయ్య ప్రచార కార్యదర్శిగాకుక్కముడికొండలు మాదిగ కుక్క ముడి రవి సంయుక్త కార్యదర్శి ఆకులపల్లిహరీష్కుక్కముడి ముత్యాలు గా కార్యవర్గ సభ్యులు గడుసు కృష్ణ కుక్కమూడి ఆంజనేయులు జోగు కృష్ణ కుక్కముడిచంటి కుక్కలలాలయ్యనుఎన్నుకున్నారుఈకమిటీనినిర్వహించిన వారు పండ్లగోపిమాదిగ జిల్లాఎమ్మార్పీఎస్నాయకులు మరియు దేవరకొండ మండల ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు నీరుకంటి శ్రీశైలం మాదిగదేవరకొండమండల ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కుక్కముడి సీనయ్య కమిటీ ఎన్నుకున్నారు.

అడవిలో అక్రమ ఇసుక తరలింపు.. రెండు ట్రాక్టర్లు పట్టివేత

-రెండు ట్రాక్టర్లు సీజ్ - ఫారెస్ట్ అధికారి రమేష్ దాడి





గాంధారి, అక్టోబర్ 14: (మహాప్రభ)
గాంధారి సబ్ డివిజన్ పరిధిలోని వెల్లుట్ల శివారులో సీతాయంపల్లి బీట్, కంపార్ట్‌మెంట్ నంబర్ 807 అటవీ ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు.అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి అటవీ సిబ్బంది దాడి చేసి రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లు –క్యారపల్లి రాజులు S/o లింగన్న, పటేల్ బార్ రాజు తండ్రి కిషన్, రెండు ట్రాక్టర్లను గాంధారి రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలించడం చట్టరీత్యా నేరమని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. ఈ దాడిలో సెక్షన్ అధికారి చంద్రశేఖర్, బీట్ అధికారులు ప్రకాష్, తిరుపతి, సందీప్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా .. పూజలు





పాపన్నపేట, అక్టోబర్ 14 (మహా ప్రభ)
కొత్తపల్లిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. ప్రత్యేకంగా తీర్చిదీద్దిన మండపంలో కొలువు దీరిన దుర్గమ్మకు అర్చకులు విశేష పూజలు చేశారు. బుధవారం యజ్ఞం కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ కాంతులతో ప్రకాశిస్తున్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

శ్రీ శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్య నాయక్ నాయక్.



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 14 (మహాప్రభ)
చింతపల్లిమండలపరిధిలోని ఎర్రమట్టి తండా లో గల ఎంతో ప్రతీష్టాత్మకంగా నెలకొల్పిన శ్రీ శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ అనంతరం ఆయన మాట్లాడుతూ దసరపండుగ సమయంలో శ్రీ తుల్జా భవాని విగ్రహా ప్రతీష్ఠించడం చాలా శుభ పరిణామం అని అమ్మ వారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఆనందంగా మెలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్, జైపాల్ నాయక్,ఆలయ పూజారి మున్యా నాయక్,సక్రు నాయక్,గాంస్య బావోజి, వార్డు సభ్యులు జైపాల్ నాయక్, జగ్నా బాణవత్,శ్రీను నాయక్, నరేష్,బాణావత్ హరి నాయక్,పర్వ్యనాయక్, సుమన్,జయ బాణావత్,రాజు, కిషన్,రవిందర్, భీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మెడుప్లస్ మెడికల్ షాప్‌ను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



దేవరకొండ అక్టోబర్ 14 (మహాప్రభ)
చారకొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడుప్లస్ మెడికల్ షాప్‌ను దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రవీంద్ర కుమార్ మాట్లాడుతూ..ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండటంలో మెడికల్ షాపులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. మెడికల్ షాప్ నిర్వాహకులు రోగులకు నాణ్యమైన మందులను అందించాలని, మందుల విక్రయంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని కోరారు.నూతనంగా ప్రారంభించిన మెడుప్లస్ మెడికల్ షాప్ నిర్వాహకులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ పొట్ట మురళి, మాల్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,నూతగంటి రఘు, శ్రీనివాస్ రెడ్డి, ధర్మ రెడ్డి, ఆనంద్,తరి గోవర్ధన్, ఆర్.వి. టి, అందుగుల సైదులు, పేట వెంకటయ్య,కొమ్ము ఉదయ్,రమేష్,జీనుకుంట్ల ప్రభాకర్,తదితరులు ఉన్నారు

హైమాస్ట్ స్తంభాలను ప్రారంభించిన సర్పంచ్ నర్సింహా,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధులతో హైమాస్ట్ స్తంభాల ఏర్పాటు.



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 14 (మహాప్రభ)
మర్రిగూడ మండలపరిధిలో రాంరెడ్డిపల్లి:గ్రామఅభివృద్ధిలో భాగంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధుల నుంచి మంజూరైన హైమాస్ట్ స్తంభాలను రాంరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లపంగి నర్సింహా ప్రారంభించారు. ఈ హైమాస్టలైట్లఏర్పాటుతో గ్రామంలోరాత్రివేళల్లోమెరుగైన వెలుతురు అందడంతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైనవాతావరణం కలగనుంది. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సర్పంచ్ లపంగి నర్సింహా గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొగాకు సైదులు, వార్డు సభ్యులు పగిల్ల యాదమ్మ, పగిల్ల శంకర్, భీమనగోని మల్లమ్మ, భీమనగోని యాదయ్య, పగిల్ల దవాలమ్మ, పగిల్ల వంశీ, లపంగి మహేందర్, హైమా, భాస్కర్, నిరంజన్, గ్రామ శాఖ అధ్యక్షుడు కారింగు నర్సింహా, పాముల కడారి ఎర్రయ్య, సిరిపంగి శీను, పొగాకు జంగయ్య, పోలగోని యాదయ్య, పీర్ల అసిస్టెంట్ సలీమోజు యాదయ్య, పాముల నర్సింహాతదితరులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రి ఉత్సవాల్లో వడ్త్య రమేష్ ప్రత్యేక పూజలు



దేవరకొండ డివిజన్ అక్టోబర్ 14 (మహాప్రభ)
చందంపేట మండలం పెద్ద మూల గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష. ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని చల్లని దీవెనలతోఉండాలని కోరుతున్నానుదేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పెద్దముల సర్పంచ్ చేపూరి సరస్వతి – కొండల్ ఉప సర్పంచ్ ఉప్పునుంతహాల నగేష్, మాజీ సర్పంచ్ కురకుల వెంకటయ్య, బోయపల్లి రాములు గౌడ్,బొమ్ము వెంకటయ్య, రత్నగిరి ఉప్పునూతల పర్వతాలు, వెంకటయ్య,జి.వెంకటయ్య, వెంకన్న, అంజయ్య, జాల శ్రీను,నగేష్,గ్రామపంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో మహిళా సమాఖ్య భవనం ప్రారంభం

-రూ.10 లక్షలతో నిర్మాణం పూర్తి..
-మహిళా సంఘాల కార్యకలాపాలకు ప్రత్యేక వేదిక





ఎల్లారెడ్డి, అక్టోబర్ 14, (మహాప్రభ):
ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘాల సమాఖ్య భవనాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు గతంలో తమ కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక భవనం అవసరమని ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తికి స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి హామీ ఇవ్వగా, అందుకు అనుగుణంగా రూ.10 లక్షల నిధులతో నిర్మాణం పూర్తయింది. నూతన భవనం ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు.ఈ భవనం ద్వారా మహిళా సంఘాల సమావేశాలు, ఇతర కార్యకలాపాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునే అవకాశం కలగనుంది. మహిళల ఆర్థిక అభివృద్ధి, స్వావలంబనకు స్వయం సహాయక సంఘాలు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భవన నిర్మాణానికి సహకరించి, ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు మహిళా సంఘాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గెలుపుకు కృషి చేస్తాం : ఎమ్మెల్యే బాలు నాయక్

-పట్టభద్రుల ఓటరు నమోదు, పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేస్తా: ఎమ్మెల్యే



దేవరకొండ, అక్టోబర్ 14:(మహా ప్రభ)
ఉమ్మడి నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విస్తృతంగా చేపట్టి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజారిటీ వచ్చేలా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు, పార్టీ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓటరు నమోదు పెంచేందుకు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి శ్రేణులతో కలిసి దేవరకొండ నియోజకవర్గం నుంచి అధిక మెజారిటీ వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని సూచించారు.

నవరాత్రి ఉత్సవాల్లో సామూహిక కుంకుమార్చన

-గండిమాసానిపేట్ దుర్గాభవాని మండపంలో ప్రత్యేక పూజలు



ఎల్లారెడ్డి, అక్టోబర్ 14, (మహాప్రభ)
ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట్ శ్రీ దుర్గాభవాని మండపంలో బుధవారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహిక కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. అనంతరం అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుడు రాజేశ్వర్ (రాజు) శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సామూహిక కుంకుమార్చనతో మండపంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

ఎమ్మెల్యే బాలు నాయక్‌కు రుణపడి ఉంటాం



దేవరకొండ అక్టోబర్ 14 (మహాప్రభ)
పాత్లవత్ తండా పి గ్రామంలో దేవరకొండ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే బాలు నాయక్ నిధులతో మా గ్రామ పంచాయతీ విద్యుత్ స్తంభాలు అవసరం ఉందని అడగగా గ్రామ ప్రజలు ఇబ్బంది పడుద్దని వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి వెంటనే మా మా గ్రామానికి స్తంభాలు పంపించడం జరిగినది.కావున బుధవారం విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాలు వెంటనే స్తంభాలు పంపించడం జరిగింది. కావున మా గ్రామ ప్రజల అందరి తరపున మా నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత నేనవత్ బాలు నాయక్ కి రుణపడి ఉంటాం.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపంచాయతీ సర్పంచ్ భారతి ధర్మ.మాజీ సర్పంచ్ వాంకుడవత్ రాజ్ కుమార్. మరియు ఉప సర్పంచ్ రాజు. మాజీ ఉప సర్పంచ్ రాజ్ కుమార్ వార్డ్ మెంబర్ మంజుల నరేందర్.నీలియో పద్మ వాల్య గ్రామ పెద్దలు యువకులు లచ్చిరాం.రవీందర్.కాలియా జానీ నిఖిల్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

నవదుర్గ సేన ఆధ్వర్యంలో ఘనంగా అన్న ప్రసాద కార్యక్రమం

-అమ్మవారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు





గాంధారి: అక్టోబర్ 14 (మహాప్రభ)
శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ నవదుర్గ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ హరాలే తానాజీ రావ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, విగ్రహ దాత వెంకట్ గౌడ్, విడిసి అధ్యక్షుడు ఆకుల రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ నవదుర్గ సేన సభ్యులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ పెద్దబూరి సాయికుమార్, వార్డు సభ్యులు పత్తి సాయిలు, గంగి రవి, పలువురు నాయకులు, శ్రీ నవదుర్గ సేన సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళ్యాణిలో కాంగ్రెస్ జెండా పండుగ

-పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్



ఎల్లారెడ్డి, అక్టోబర్ 14, (మహాప్రభ)
ఎల్లారెడ్డి మండలం కళ్యాణి గ్రామంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అంజిల్ రెడ్డి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న ఆల ప్రీతిరెడ్డి



దేవరకద్ర నియోజకవర్గం ।
అక్టోబర్ 14 మహా ప్రభ
దేవరకద్ర మండలం పెద్దరాజమూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు అంజిల్ రెడ్డి నూతన గృహప్రవేశం, వాస్తుపూజ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుమార్తె ఆల ప్రీతిరెడ్డి హాజరై, అంజిల్ రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆల ప్రీతిరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల గడపకు ఇందిరమ్మ ఇళ్ల వెలుగు!





-కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుకూ కృషి చేస్తా: ఎమ్మెల్యే జీఎంఆర్

-సిరివాటి జంగం రవి వినతిపై సానుకూల స్పందన

దేవరకద్ర, అక్టోబర్ 14 (మహాప్రభ):
సొంతిల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు.. సామాజిక అవసరాల కోసం కమ్యూనిటీ హాళ్లు.. బేడ బుడగ జంగాల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) హామీ ఇచ్చారు. అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరుతోపాటు, ఆయా గ్రామాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.
దేవరకద్ర నియోజకవర్గంలోని బేడ బుడగ జంగాల కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేహెచ్‌పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు సిరివాటి జంగం రవి ఎమ్మెల్యే జీఎంఆర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, ఇందిరమ్మ ఇళ్లు, కమ్యూనిటీ హాళ్ల మంజూరుపై చర్చించారు.
ప్రతి మండలంలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలి
నియోజకవర్గంలో సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న బేడ బుడగ జంగాల నిరుపేద కుటుంబాలను గుర్తించి, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సిరివాటి జంగం రవి కోరారు. సామాజిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రతి మండలంలో ఒక కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని, అవసరాన్ని బట్టి ఆయా గ్రామాల్లోనూ వీటిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.
అవసరమైన చోట్ల ఏర్పాటుకు కృషి
బేడ బుడగ జంగాల నాయకుల వినతిపై ఎమ్మెల్యే జీఎంఆర్ సానుకూలంగా స్పందించారు. కమ్యూనిటీ హాళ్లు అవసరమైన గ్రామాలను గుర్తించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో వాటి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా తగిన చర్యల కోసం ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చారు.
తమ సామాజిక వర్గానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, పేద కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరినట్లు సిరివాటి జంగం రవి తెలిపారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యేకు బేడ బుడగ జంగాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో సిరివాటి ఏసన్న, వార్డు సభ్యురాలు సిరివాటి లావణ్య, వెంకటేష్, సిరిగిరి వెంకటేష్, మహేందర్, పరశురాం, కుల పెద్దలు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.

-ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు..



మెదక్ జిల్లా -14అక్టోబర్ (మహాప్రభ).
ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు. రవిచంద్ర,ఎమ్మెల్సీ తాతా మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ జెడ్పీ చైర్మన్ తుల.ఉమ తదితరులు స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పెద్ద సంఖ్యలో హాజరై ఆటపాటలతో సందడి చేశారు.ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలతో జరుపుకునే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను చాటుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులందరూ బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

గురుకొండలో కాంగ్రెస్‌లోకి వలసలు..

-ఎమ్మెల్యే జీఎంఆర్ సమక్షంలో బీఆర్ఎస్, బీజేపీ నేతల చేరిక

-గురుకొండ గ్రామ సర్పంచ్ ఉషన్న ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పలువురు నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు



దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 14 మహా ప్రభ
దేవరకద్ర నియోజకవర్గం: దేవరకద్ర మండలం గురుకొండ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ నూతనంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామ సర్పంచ్ ఉషన్న సమక్షంలో జరిగిన ఈ చేరికలతో గురుకొండలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం చేకూరిందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు వివరించడంతోపాటు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.

గాంధారి మండల కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

-పూల బతుకమ్మలతో సందడి చేసిన మహిళా ఉద్యోగులు



గాంధారి:అక్టోబర్ 14 (మహాప్రభ)
గాంధారి మండల కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని మహిళా ఉద్యోగులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజేశ్వర్ మాట్లాడుతూ అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ప్రకృతిలో లభించే తంగేడు, గునుగు, బంతి, చేమంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజించి ఆడపడుచులు ఆడి పాడతారు. ఇది ప్రకృతిని, స్త్రీత్వాన్ని గౌరవించే గొప్ప పండుగ. బతుకమ్మ, దసరా పండుగ వేడుకలు ఘనంగా జరుపుకుంటారు. ఈ కార్యక్రమంలో మండలాధికారులు. సిబ్బంది, మహిళలు, అందరూ పాల్గొన్నారు.

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు..



మెదక్ జిల్లా -14అక్టోబర్ (మహాప్రభ).
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో ఎలాంటి అనర్హులైన ఓటర్లు మిగిలిపోకుండా ప్రజాత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 15, 16 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన పౌరులు, గతంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు, తొలిసారిగా ఓటు హక్కు పొందనున్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతతో పాటు ఓటరు జాబితాలో పేరు లేని వారు సంబంధిత పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఫారం-6 ద్వారా తమ పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రత్యేక క్యాంపుల నిర్వహణ సమయంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి అవసరమైన మార్గదర్శకాలు, సహాయాన్ని వారు అందిస్తారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావడం బాధ్యతగా భావించాలని స్పష్టంచేశారు. కాబట్టి జిల్లాలోని అర్హులైన పౌరులందరూ అక్టోబర్ 15, 16 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక క్యాంపులను వినియోగించుకొని ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ప్రతిమా సింగ్ విజ్ఞప్తి చేశారు.

బిజినెస్

భారీగా తగ్గిన బంగారం ధరలు

-ఒక్కరోజే పది గ్రాములపై రూ.1,030 తగ్గుదల
-రూ.1,48,260కు చేరిన 24 క్యారెట్ల పసిడి
-22 క్యారెట్ల బంగారం ధర రూ.1,35,900
-మూడు రోజుల్లో భారీగా దిగివచ్చిన ధరలు
-24 క్యారెట్లపై రూ.3,160 తగ్గుదల
-22 క్యారెట్లపై రూ.2,900 మేర పతనం
-స్థిరంగా కొనసాగుతున్న వెండి ధర
-కిలో వెండి ధర రూ.2.45 లక్షలు



బంగారం ధరలు బుధవారం భారీగా తగ్గాయి. బులియన్ మార్కెట్‌లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.950 తగ్గి రూ.1,35,900కు చేరింది. అలాగే 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,030 తగ్గి రూ.1,48,260 వద్ద కొనసాగుతోంది. వరుసగా తగ్గుతున్న బంగారం ధరలతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గత మూడు రోజుల్లో బంగారం ధరలు గణనీయంగా దిగివచ్చాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మొత్తం రూ.3,160 తగ్గగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.2,900 మేర తగ్గింది. తక్కువ ధరలకు బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ తగ్గుదల కొంత అనుకూలంగా మారింది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు అమల్లో ఉండనున్నాయి. అయితే నగలు కొనుగోలు చేసేటప్పుడు ఆభరణాల తయారీ ఖర్చులు, ఇతర పన్నులు అదనంగా ఉండవచ్చు.

వాట్సాప్‌లో కొత్త కాంటాక్ట్స్ ట్యాబ్!

-కాంటాక్ట్స్ నిర్వహణ మరింత సులభం
-కొత్త రూపంలో సెర్చ్ సదుపాయం
-ఆన్‌లైన్‌లో ఉన్నవారిని గుర్తించేందుకు గ్రీన్ డాట్
-పుట్టినరోజుల గురించి ప్రత్యేక అలర్ట్స్
-మెటా ఏఐకి అనుసంధానించే అవకాశం
-స్నేహితులను ఆహ్వానించేందుకు ప్రత్యేక ఆప్షన్
-ప్రస్తుతం ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌లో పరీక్షలు
-త్వరలో అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం



ప్రముఖ సందేశాల యాప్ వాట్సాప్ వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచేందుకు కొత్తగా 'కాంటాక్ట్స్ ట్యాబ్' ఫీచర్‌ను తీసుకురానుంది. దీని ద్వారా ఫోన్‌లోని పరిచయాలను నిర్వహించడం, స్నేహితులతో సంభాషణలు ప్రారంభించడం మరింత సులభం కానుంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగిస్తున్న ఈ యాప్‌లో కొత్త ఫీచర్లతో వినియోగాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు సంస్థ ప్రయత్నిస్తోంది. కొత్త కాంటాక్ట్స్ ట్యాబ్‌లో మెరుగైన సెర్చ్ బార్ ఉండనుంది. దీని సాయంతో అవసరమైన వ్యక్తుల పేర్లను సులభంగా వెతకవచ్చు. అలాగే పరిచయాలను క్రమబద్ధంగా అమర్చుకునే సదుపాయం కూడా ఉండనుంది. ఆన్‌లైన్‌లో ఉన్నవారిని గుర్తించేందుకు గ్రీన్ డాట్ సూచికను చూపించే అవకాశం ఉంది. దీంతో ఎవరితో సంభాషణ ప్రారంభించాలనుకున్నా త్వరగా గుర్తించవచ్చు. ఈ ఫీచర్‌లో పుట్టినరోజుల గుర్తింపునకు ప్రత్యేక అలర్ట్స్, మెటా ఏఐకి సంబంధించిన లింక్, స్నేహితులను వాట్సాప్‌లోకి ఆహ్వానించే ఆప్షన్ వంటి సదుపాయాలు కూడా ఉండనున్నాయి. వీటితో పరిచయాల నిర్వహణతో పాటు యాప్‌లోని ఇతర సేవలను వినియోగించడం సులభతరం కానుంది. వినియోగదారుల వ్యక్తిగత సమాచార భద్రతకు వాట్సాప్ ప్రాధాన్యత ఇస్తోంది. ప్రస్తుతం ఈ కొత్త ఫీచర్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్‌లో పరీక్షల దశలో ఉన్నట్లు సమాచారం. పరీక్షలు పూర్తయిన తర్వాత దశలవారీగా అందరికీ అందుబాటులోకి తీసుకురావచ్చని భావిస్తున్నారు. అయితే, విడుదల తేదీ, తుది ఫీచర్లపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

పండుగ ఆఫర్లు.. హోండా కార్లపై రూ.2.35 లక్షల వరకు తగ్గింపు

-నవరాత్రి, దసరా సందర్భంగా ప్రత్యేక రాయితీలు
-ఎలివేట్ ఎస్‌యూవీపై గరిష్ఠంగా రూ.2.35 లక్షల ప్రయోజనాలు
-హోండా సిటీపై రూ.1.70 లక్షల వరకు తగ్గింపు
-అమేజ్ కారుపై రూ.67 వేల వరకు ఆదా
--ఎంపిక చేసిన వాహన నమూనాలు, వేరియంట్లకు మాత్రమే ఆఫర్లు
-పండుగ వేళ కారు కొనుగోలుదారులకు మంచి అవకాశం
-పాత ఎలివేట్ వేరియంట్లపై ప్రత్యేక రాయితీలు
-డీలర్ల వద్ద ఆఫర్ల వివరాలు తెలుసుకోవాలని సూచన



నవరాత్రి, దసరా పండుగలను పురస్కరించుకుని హోండా కార్ల సంస్థ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. అమేజ్, సిటీ, ఎలివేట్ మోడళ్లలో ఎంపిక చేసిన వేరియంట్లపై గరిష్ఠంగా రూ.2.35 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తోంది. పండుగ సమయంలో కొత్త కారు కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ ఆఫర్లు కొంత ఊరటనివ్వనున్నాయి. హోండా ఎలివేట్ ఎస్‌యూవీపై అత్యధికంగా రూ.2.35 లక్షల వరకు తగ్గింపు ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే ఈ ఆఫర్లు ఫేస్‌లిఫ్ట్ లేని ఎంపిక చేసిన వేరియంట్లకు వర్తిస్తాయి. ఎస్‌యూవీ కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ రాయితీలు ఆకర్షణీయంగా మారనున్నాయి. హోండా సిటీ ఫేస్‌లిఫ్ట్ మోడల్‌పై రూ.1.70 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తున్నారు. మరోవైపు, హోండా అమేజ్ కాంపాక్ట్ సెడాన్‌పై రూ.67 వేల వరకు ఆదా చేసుకునే అవకాశం ఉంది. మోడల్, వేరియంట్‌ను బట్టి తగ్గింపు మొత్తం మారుతుంది. ఈ ఆఫర్లు ఎంపిక చేసిన వాహనాలకు మాత్రమే వర్తిస్తుండటంతో కొనుగోలు చేసే ముందు సమీప హోండా డీలర్‌ను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవడం మంచిది. పండుగ రాయితీలు, అందుబాటులో ఉన్న వాహనాల ఆధారంగా వినియోగదారులు తమ బడ్జెట్‌కు అనుగుణంగా కారును ఎంచుకోవచ్చు.

స్పోర్ట్స్

అనుమతి లేకుండానే టోర్నీలో పేరు.. నిర్వాహకులపై శిఖర్ ధావన్ చట్టపరమైన చర్యలు

-తన అనుమతి లేకుండా పేరు వాడుకున్నారని ఆరోపణ
-వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులపై ఆగ్రహం
-చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్న ధావన్ బృందం
-ఏఅనధికార ప్రకటనలను నమ్మొద్దని విజ్ఞప్తి
-మీడియా, అభిమానులు స్పందించవద్దని సూచన
-వన్డేల్లో 6,793 పరుగులు చేసిన మాజీ ఓపెనర్
-టెస్టుల్లో ఏడు శతకాలు సాధించిన ధావన్
-టీ20ల్లో 11 అర్ధశతకాలతో రాణించిన భారత క్రికెటర్



న్యూఢిల్లీ: వరల్డ్ టీ20 కాంటినెంట్ కప్ నిర్వాహకులు తన అనుమతి లేకుండానే టోర్నీకి సంబంధించి తన పేరును ఉపయోగించుకున్నారని మాజీ భారత క్రికెటర్ శిఖర్ ధావన్ ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు తమ బృందం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. తనకు తెలియకుండా, తన సమ్మతి లేకుండా తన పేరును వాడుకోవడంపై ధావన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. తన పేరుతో వస్తున్న అనధికార ప్రకటనలను నమ్మవద్దని మీడియా సంస్థలు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అధికారికంగా ధ్రువీకరించని సమాచారంపై స్పందించకుండా ఉండాలని సూచించారు. తన అనుమతి లేకుండా పేరు ఉపయోగించిన వ్యవహారంపై తమ బృందం తగిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్లలోనూ ధావన్ ప్రాతినిధ్యం వహించారు. ముఖ్యంగా వన్డే క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శనతో గుర్తింపు పొందారు. 167 వన్డేలు ఆడిన ఆయన 44.1 సగటుతో 6,793 పరుగులు సాధించారు. ఇందులో 17 శతకాలు, 39 అర్ధశతకాలు ఉన్నాయి. టెస్టు క్రికెట్‌లో 34 మ్యాచ్‌లు ఆడిన ధావన్ 40.6 సగటుతో 2,315 పరుగులు చేశారు. ఈ ఫార్మాట్‌లో ఏడు శతకాలు, ఐదు అర్ధశతకాలు సాధించారు. టీ20ల్లో 68 మ్యాచ్‌లు ఆడి 1,759 పరుగులు చేశారు. ఇందులో 11 అర్ధశతకాలు ఉన్నాయి. భారత క్రికెట్‌లో విజయవంతమైన ఓపెనర్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ధావన్.. ప్రస్తుతం తన పేరును అనుమతి లేకుండా ఉపయోగించిన వ్యవహారంపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు.

ప్రిన్స్ విలియమ్‌తో కలిసి క్రికెట్ ఆడిన గంగూలీ, రహానే



లండన్:
బ్రిటీష్ రాకుమారుడు ప్రిన్స్ విలియమ్ తో కలిసి భారత మాజీ క్రికెటర్లు సౌరవ్ గంగూలీ, అజింక్య రహానే ఫ్రెండ్లీ టెన్నిస్ బాల్ మ్యాచ్ ఆడారు. ప్రిన్స్ విలియమ్‌కు చెందిన పర్యావరణ సంస్థ ఎర్త్‌షాట్ అవార్డులను ఇవ్వనున్నది. దీని కోసం నిధుల సేకరణలో భాగంగా ఈవెంట్‌ను నిర్వహించారు. వచ్చే నెలలో ముంబైలో ఎర్త్‌షాట్ ప్రైజ్ సెర్మనీ జరగనున్నది. ఇటీవల రిటైర్ అయిన రహానేతో పాటు టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, వెస్టిండీస్ బ్యాటర్ బ్రియన్ లారా, ఇంగ్లండ్ ప్లేయర్లు జో రూట్, హ్యారీ బ్రూక్ కూడా ఈవెంట్‌కు హాజరయ్యారు. ప్రిన్స్ విలియమ్ ఆహ్వానం మేరకు క్రికెటర్లు బకింగ్‌హమ్ ప్యాలెస్ ఆవరణలో మ్యాచ్ ఆడారు. ఎన్నో వేదికల్లో క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించానని, కానీ టెన్నిస్ బంతితో క్రికెట్ ఆడడం, అది కూడా బకింగ్‌హమ్ ప్యాలెస్ ముందు ఆడడం ఓ మరువలేని అనుభవం అన్నారు. లింక్డిన్ పోస్టులో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆరవ ఎర్త్‌షాట్ అవార్డులను నవంబర్ 17వ తేదీన ముంబైలో ఇవ్వనున్నారు.

ధోనీ, కోహ్లీ ఫార్ములా.. హర్మన్, స్మృతి విషయంలో రిపీట్ కావాలి: బీసీసీఐ

-మంధానకు భారత మహిళ క్రికెట్ పగ్గాలు
-హర్మన్ ప్రీత్ అండగా నిలవాలన్న బీసీసీఐ
-ధోనీ, కోహ్లీ ఫార్ములా ఇక్కడ రిపీట్ కావాలని ఆకాంక్ష



భారత మహిళా క్రికెట్ జట్టులో కెప్టెన్సీ మార్పు సమర్థవంతంగా సాగడానికి బీసీసీఐ ఒక స్పష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది. సుదీర్ఘకాలం పాటు జట్టును విజయవంతంగా నడిపిన హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన జట్టు బాధ్యతలను స్వీకరించింది. జింబాబ్వేతో జరగనున్న సిరీస్‌తో మంధాన కెప్టెన్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. అయితే, కెప్టెన్ మారినా హర్మన్‌ప్రీత్ కౌర్ జట్టులోనే సభ్యురాలిగా కొనసాగుతుండటంపై బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు.మిథున్ మన్హాస్ మాట్లాడుతూ.. భారత పురుషుల జట్టులో విజయవంతమైన కెప్టెన్సీ మార్పిడి విధానాన్ని ఇక్కడ గుర్తుచేశారు. గతంలో మహేంద్ర సింగ్ ధోనీ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న తర్వాత కూడా విరాట్ కోహ్లీకి మైదానంలో ఎంతగానో సహాయపడ్డాడు. ఫీల్డింగ్ మార్పులు, డీఆర్ఎస్ నిర్ణయాలు, బౌలింగ్ మార్పులలో ధోనీ వెన్నంటి ఉండి నడిపించిన తీరును మన్హాస్ ఉదాహరించారు. అదేవిధంగా గంగూలీ ధోనీకి, ధోనీ.. కోహ్లీ, రోహిత్‌కు, ఇప్పుడు రోహిత్ - విరాట్ కలిసి శుభ్‌మన్ గిల్‌కు దిశానిర్దేశం చేస్తున్న సంప్రదాయం మహిళా క్రికెట్‌లోనూ కొనసాగాలని ఆయన అన్నారు. కెప్టెన్సీ అనేది ఎంత అనుభవం ఉన్న ఆటగాడికైనా ఎంతో సవాలుతో కూడుకున్న వ్యవహారమని మన్హాస్ అభిప్రాయపడ్డారు. మైదానంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు లేదా నిర్ణయాలు తీసుకోవడంలో అయోమయం నెలకొన్నప్పుడు హర్మన్‌ప్రీత్ వంటి సీనియర్ ప్లేయర్ పక్కన ఉండటం మంధానకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. జట్టులో అనుభవజ్ఞులైన సీనియర్లు ఉన్నప్పుడే కొత్తవారికి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం అత్యంత సురక్షితమైన, సరైన పద్ధతి అని ఆయన అభిప్రాయపడ్డారు.రాబోయే ప్రతిష్టాత్మక టోర్నీలను దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఈ మార్పును పక్కా ప్రణాళికతో చేపట్టింది. మంధానకు మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ నుంచి పూర్తి మద్దతు లభిస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు ధీమా వ్యక్తం చేశారు. టీమిండియా ఇద్దరు గొప్ప దిగ్గజ ఆటగాళ్ల సేవలను ఒకేసారి ఉపయోగించుకుంటూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుందని అభిమానులు, విశ్లేషకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ 'రణబాలి'
అడ్వాన్స్ బుకింగ్స్ షురూ.!



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, సెన్సేషనల్ హీరోయిన్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న తరుణంలో చిత్ర యూనిట్ అభిమానులకు అదిరిపోయే అప్డేట్ అందించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రానికి సంబంధించిన అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రాయలసీమ నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత ద్వయం అజయ్ -- అతుల్ అదిరిపోయే మ్యూజిక్ అందిస్తుండగా, హాలీవుడ్ ప్రముఖ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో ప్రతినాయకుడిగా నటిస్తుండటం విశేషం. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, సింగిల్ స్క్రీన్‌లు మరియు మల్టీప్లెక్స్‌లలో రణబాలి అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా తెలుగు వెర్షన్‌కు సంబంధించి ప్రీ-సేల్స్ ఊపందుకున్నాయి. ఫస్ట్ డే ఫస్ట్ షో కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఓవర్సీస్‌లో తొలి రోజు కేవలం తెలుగు వెర్షన్ మాత్రమే గ్రాండ్‌గా విడుదలవుతుండగా, ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్లు అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సమాచారం. సినిమాకు హైప్ విపరీతంగా ఉండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్స్ రాబట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అక్టోబర్ 16, 2026న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



'కల్కి 2' సెట్స్‌లోకి రెబల్ స్టార్ ప్రభాస్..
త్వరలో ప్రారంభం కానున్న భారీ షెడ్యూల్!



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ సీక్వెల్ చిత్రం 'కల్కి 2898 ఏడీ -- పార్ట్ 2' షూటింగ్‌కు సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ తెరకెక్కిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ పౌరాణిక చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మొదటి భాగం ఘనవిజయం సాధించడంతో, దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సీక్వెల్‌ను మరింత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన తదుపరి షెడ్యూల్ మరియు షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి.అయితే ప్రభాస్ రేపటినుంచి ఈ సినిమా షూటింగ్ సెట్స్‌లో అడుగుపెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్ తన కీలక సన్నివేశాల షూటింగ్‌లో పాల్గొనబోతున్నాడు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి దిగ్గజ నటులు నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను 2027 నాటికి పూర్తి చేసి, భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ కొత్త షెడ్యూల్ అప్‌డేట్‌తో ఆయన అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.



చైతూతో పెళ్లి తర్వాత ఆ విషయంలో నా ఆలోచ విధానం మారింది..

టాలీవుడ్ స్టార్ నాగచైతన్య సతీమణి శోభిత ధూళిపాళకు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందన్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె అక్కినేని వారసుడు, స్టార్ హీరో నాగచైతన్యతో ప్రేమ, వివాహం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే పెళ్లి తర్వాత తన ఆలోచన విధానం మారిందంటూ ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఒక నటుడితో ప్రేమలో పడడంపై తన పాత అభిప్రాయాలు ఎలా మారాయో అనే విషయాలను మనసు విప్పి చెప్పారు. నటీనటులతో ఎప్పటికీ డేటింగ్ చేయబోనని కెరీర్ ఆరంభంలో చెప్పిన ఆమె ఇప్పుడు అదే కామెంట్స్ పై రియాక్ట్ అయ్యారు. 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శోభిత తన వైవాహిక బంధం గురించి స్పందించారు. సంవత్సరాలు గడిచేకొద్దీ తన ఆలోచనా విధానం ఎలా మారిందో వివరించారు. తన వృత్తికి చెందిన వారితో డేటింగ్ చేయాలనుకోవడం లేదని 2016లో తాను చేసిన వ్యాఖ్యను గుర్తుచేసుకున్నారు."బహుశా నా చుట్టూ నేను చూసిన ఉదాహరణల వల్లేనేమో ఆ సమయంలో నేను ఒక మూసలో ఇరుక్కుపోయాను. అప్పుడు నా ఆలోచనా విధానం సంకుచితంగా ఉండి ఉంటుంది." అని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు నమ్మారన్న కారణంతో ఒకే అభిప్రాయాలకు అంటిపెట్టుకుని ఉండకుండా, వయసు పెరిగే కొద్దీ విషయాలను భిన్నంగా చూసేందుకు ప్రజలు సుముఖంగా ఉండాలని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. "తమ అభిప్రాయాలను మార్చుకోని వారిని చూస్తే నాకు ఎక్కువ భయం. వేర్వేరు సమయాల్లో వేర్వేరు అభిప్రాయాలు కలిగి ఉండటంలో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. నేను పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోవడానికి సిద్ధంగా ఉన్నాను" అని ఆమె అన్నారు.అలాగే నాగ చైతన్యతో వివాహం తర్వాత వ్యక్తిగత జీవితంపై పెరిగిన పబ్లిక్ ఫోకస్, సోషల్ మీడియా చర్చలపై ఆమె స్పందించారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు ఎప్పటికప్పుడు మారుతుంటాయని.. వాటితో అతిగా మమేకమైతే మన సొంత అస్తిత్వాన్ని కోల్పోతామని అన్నారు. "సమాజం వాతావరణం లాంటిది. అది వస్తూ పోతూ ఉంటుంది. మీరు ఆ వాతావరణంతోనే ఎక్కువగా మమేకమైతే, వాతావరణం మారినప్పుడు మీరు దారి తప్పిపోతారు. కాబట్టి, స్థిరంగా ఉంటూ, వాస్తవికత ఏమిటో గమనిస్తూ ఉండటం ముఖ్యం అని నేను అనుకుంటున్నాను. ఆ విషయం తెలుసుకునే అదృష్టం నాకు కలిగిందని భావిస్తున్నాను. స్థిరంగా ఉండటం అనేది మీరు తీసుకునే ఒక నిర్ణయం" అని ఆమె అన్నారు.

'కల్ట్' వాయిదా పడినట్టేనా ..

- విశ్వక్ సేన్ సినిమా రిలీజ్‌పై ఇంకా రాని క్లారిటీ!



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ నటుడిగానే కాకుండా దర్శకుడిగానూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈ క్రమంలో ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న క్రేజీ థ్రిల్లర్ చిత్రం 'కల్ట్' పై మొదటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా భారతీయ తెరపై స్లాషర్ థ్రిల్లర్‌గా, 'ఏ' సర్టిఫికెట్‌తో కూడిన చిత్రంగా దీన్ని పరిచయం చేయడంతో ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగాయి. అయితే అక్టోబర్ నెలాఖరులో విడుదల చేస్తామని గతంలో ప్రకటించిన ఈ సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'కల్ట్' సినిమాను అక్టోబర్ చివరి వారంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చిత్రబృందం గతంలో వెల్లడించింది. ఈ నెల ప్రారంభంలో ఓ అప్‌డేట్ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత సినిమా గురించి పెద్దగా సమాచారం బయటకు రాలేదు.సాధారణంగా విడుదలకు దగ్గరపడుతున్న సినిమాలకు ప్రమోషన్లు, పోస్టర్లు, టీజర్లు లేదా ట్రైలర్లతో సందడి మొదలవుతుంది. కానీ 'కల్ట్' విషయంలో అలాంటి హడావుడి కనిపించకపోవడంతో సినిమా అనుకున్న సమయానికి విడుదలవుతుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అక్టోబర్ నెలలో ఇప్పటికే సగానికి పైగా సమయం గడిచిపోయింది. అయినప్పటికీ విడుదల తేదీపై స్పష్టత లేకపోవడం, ప్రచార కార్యక్రమాలు ప్రారంభం కాకపోవడం వాయిదా వార్తలకు ఊతమిస్తోంది. అయితే సినిమా వాయిదా పడినట్లు ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో విడుదల తేదీపై చిత్రబృందం నుంచి వచ్చే తదుపరి అప్‌డేట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. విశ్వక్ సేన్ తన సినిమాల్లో విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'కల్ట్'తో ఆయన మరోసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టడం విశేషం. స్లాషర్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా, దాని కథాంశం మరియు చిత్రీకరణ శైలి కారణంగా ఇప్పటికే సినీ వర్గాల్లో చర్చకు వచ్చింది.ఈ చిత్రంలో గాయత్రి భరద్వాజ్, మురళీ శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తారక్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. కథ, పాత్రలు, హింసాత్మక సన్నివేశాల నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించిన ప్రకటనలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అయితే 'కల్ట్' విడుదలపై నెలకొన్న సందిగ్ధతకు చిత్రబృందం అధికారిక ప్రకటనతోనే తెరపడనుంది

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com